



## ప్రయాణికులకు పండుగ వెతలు

**కొయ్యలగూడెం:** సంక్రాంతి పండగకు స్వగ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నెల 10వ తేదీ నుంచే సెలవులు ప్రారంభం కావడంతో విద్యార్థులు, వారి కుటుంబాలతో సహా బంధువుల ఇళ్లకు రాకపోకలు సాగించేవారు ఎక్కువయ్యారు. ఆర్టీసీ పండుగ వేళల్లో అదనపు సర్వీసులు నడపాల్సింది పోయి ఉన్న సర్వీసులనే కుదించిందని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. ప్రైవేటు బస్సుల దోపిడీకీ అడ్డు అదుపు లేకుండా పోయింది. హైదరాబాద్ టికెట్టు రూ.4 వేలు పలుకుతుంది. ఆటోవాలాలు సైతం సర్వీసు ధరలు అమాంతంగా పెంచేశారు.

# దినదినాభివృద్ధిలో జంగారెడ్డిగూడెం

**జంగారెడ్డిగూడెం:** ఏలూరు జిల్లాలోని ముఖ్య పట్టణాల్లో జంగారెడ్డిగూడెం ఒకటి. రెడ్డిరాజులు పరిపాలించిన ప్రాంతంగా దీనికి పేరు. ఏజెన్సీ ప్రాంతాలకు ముఖ ద్వారంగా ఉండే జంగారెడ్డిగూడెం ఎన్నో విశిష్టతలకు నిలయం. విద్య, వైద్యం, వ్యాపారం, రియల్ ఎస్టేట్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలకు అతి దగ్గరగా ఉండి, అన్ని అవసరాలు తీర్చే ముఖ్య పట్టణంగా జంగారెడ్డిగూడెం నిలిచింది. పట్టణం విద్యలో నూతన ప్రమాణాలు నెలకొల్పుతూ ముందుకు సాగుతోంది. స్టేట్, సీబీఎస్ఈ సిలబస్‌లను బోధించే పాఠశాలలు ఉన్నాయి. ఇక్కడ పలు విద్యాసంస్థలు ఉత్తమ విద్యను అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాయి. జంగారెడ్డిగూడెం చుట్టూ ఏజెన్సీ ప్రాంతం కావడం, వైద్య సేవలు అంతంత మాత్రంగా ఉండేవి. అయితే ఈ పట్టణం దినదినాభివృద్ధి చెందడంతో వైద్యసేవలు కూడా అభివృద్ధి చెందాయి. 100 పడకల ఏరియా ఆసుపత్రి ఏర్పాటు చేయగా, ఇందులో అనేక రకాల సేవలు అందిస్తున్నారు. పట్టణంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు సైతం ఏర్పడ్డాయి. వీటిలో సాధారణం నుంచి క్రిటికల్ కేర్ వరకు అన్ని వైద్యసేవలు లభిస్తున్నాయి.


జంగారెడ్డిగూడెం వ్యూ

### వ్యాపారాలకు అనుకూలం

జంగారెడ్డిగూడెం వ్యాపారాలకు అనువైన పట్టణం. రాజమండ్రి, ఏలూరులకు ధీటుగా స్థానికంగా రకరకాల మాల్స్‌ను ప్రారంభించాయి. పట్టణ శివారు ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలుస్తున్నాయి.

## శ్రీవారి కనుమ ఉత్సవానికి ఏర్పాట్లు

**ద్వారకాతిరుమల:** కనుమ నాడు కాకైనా కదలదన్నది నానుడి. కానీ ఆరోజు శ్రీవారు క్షేత్రం విడిచి పొరుగు గ్రామానికి వెళ్తారు. అదే ఇక్కడ విశిష్టత. ఏడాదిలో ఒకసారి మాత్రమే ఇలా జరుగుతుంది. ప్రతి ఏటా సంక్రాంతి పండుగ మరుసటి రోజు కనుమ నాడు ఈ ఉత్సవాన్ని నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఈనెల 15న కనుమ వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కనుమ మండపాన్ని, పరిసర ప్రాంతాలనూ రంగులు, విద్యుద్దీప తోరణాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. పండుగ నాడు మధ్యాహ్నం స్వామివారు ఉభయ దేవేరులతో రాజాదిరాజ వాహనంపై ఆలయం నుంచి బయల్దేరి దొరసానిపాడు గ్రామానికి వెళ్తారు. అక్కడ ప్రజలు కనుమ అయినప్పటికీ మాంసాహారాన్ని ముట్టకుండా, ఎంతో నియమనిష్టలతో స్వామివారికి అడుగడుగునా బ్రహ్మరథం పడతారు. ఈ సందర్భంగా స్వామివారి వాహనం భక్తుల గోవింద నామ స్మరణల నడుమ కనుమ మండపం వద్దకు చేరుకుంటుంది. అక్కడ మండపంలో శ్రీవారు, అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం తిరిగి స్వామివారు గిరి ప్రదక్షిణగా ఆలయానికి చేరుకుంటారు. ఈ వేడుకలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని, తీర్థప్రసాదాలను స్వీకరించాలని ఆలయ ఇన్‌చార్జి ఈఓ వేండ్ర త్రినాథరావు కోరారు.



## అధికారులపై చర్యలు తీసుకోవాలి

**బుట్టాయగూడెం:** ఏజెన్సీ ప్రాంతంలో చట్టాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. గిరిజన మహిళపై దౌర్జన్యం చేసిన రెవెన్యూ, పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. బుట్టాయగూడెం రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ పోరంబోకు భూముల్లో ఇల్లు నిర్మించుకుంటున్న మడకపాటి అనూష అనే యువతిపై శుక్రవారం సాయంత్రం రెవెన్యూ, పోలీస్ అధికారులు దాడి చేశారని రవి ఆరోపించారు.

## నేడు ముగ్గుల పోటీ

**కుక్కునూరు:** మండలంలో సంక్రాంతి, సీపీఐ వందేళ్ల పండుగను పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీ నిర్వహించనున్నట్టు ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల పేర్కొన్నారు. ఆవుల సత్యనారాయణరెడ్డి జ్ఞాపకార్థం స్థానిక లిటిల్ స్టార్ హైస్కూల్ మైదానంలో ఉదయం 9 గంటలకు ముగ్గుల పోటీ ప్రారంభమవుతుందని తెలిపారు. మహిళలు ముగ్గుతో పాటు కలర్స్ కూడా వెంట తెచ్చుకోవాలని కోరారు. విజేతలకు బహుమతులు అందజేస్తారని పేర్కొన్నారు.

## వ్యక్తి ఆత్మహత్య

**కొయ్యలగూడెం:** అనారోగ్య కారణాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్సై వి.చంద్రశేఖర్ శనివారం తెలిపారు. కొయ్యలగూడెం కాలింగుల పేటకు చెందిన చింతాడ కర్ణుడు (62) ఈనెల 9న తన ఇంటి వద్ద పురుగుమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. కర్ణుడు ఏలూరు జనరల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మరణించాడని పేర్కొన్నారు. కర్ణుడు భార్య కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

## కార్మికుల నిరసన

**చింతలపూడి:** ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శనివారం స్థానిక పాత బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా నగర పంచాయతీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. తెలిపారు. నిరసన శిబిరాన్ని యూనియన్ కార్యదర్శి టి.విజయరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎస్ నారాయణ మాట్లాడారు. వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు.



## దరఖాస్తుల ఆహ్వానం

**టి.నరసాపురం:** చౌక డిపోలకు శాశ్వత డీలర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తహసీల్దార్ టి.సాయిబాబ శనివారం తెలిపారు. మండలంలో రేషన్ షాపు నెం.5లో ఓసీ ఈబీసీ, 22లో ఓసీ, 4లో ఎస్సీ ఖాళీగా ఉన్నట్టు పేర్కొన్నారు. వివరాలకు రెవెన్యూ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

**కె.కోట మండలంలో..**

**కామవరపుకోట:** కేఎస్ రామవరం నెం.511011 ఓసీ (మహిళ), ఈస్ట్ యడవల్లి నెం.511016 బీసీ (బీ), సాగిపాడు నెం.511021 ఓసీ (మహిళ), ఆడమిల్లి నెం.511023 ఓసీ, కామవరపుకోట యానాదుల కాలనీ నెం.511026 బీసీ(ఏ) చౌక ధరల డీలర్ల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్టు తహసీల్దార్ జి.ఎలీషా పేర్కొన్నారు.

**లింగపాలెం మండలంలో..**

**లింగపాలెం:** మండలంలోని టీసీ హెచ్‌ఆర్ పాలెంలోని రేషన్ షాపు నెం.8 (జనరల్), ధర్మాజీగూడెంలో నెం.4 (ఎస్సీ మహిళ), మఠంగూడెం నెం.9 (ఎస్సీ జనరల్), కొణిజర్ల నెం.6 (బీసీ-బీ), కలరాయనగూడెం నెం.12 (ఓసీ మహిళ), బాదరాల నెం.14 (ఓసీ ఈడబ్ల్యూఎస్), గణపవారిగూడెం నెం.23 ఎస్సీ జనరల్, రంగాపురం నెం.15 షాపు ఎస్టీ జనరల్‌కు కేటాయించినట్టు తహసీల్దార్ నజీమ్ తెలిపారు. ఈ షాపులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు.

## పందేలను సహించం

**కామవరపుకోట:** సంక్రాంతి పండుగ ముసుగులో కోడిపందేలు, పేకాట, గుండాట వంటి జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర హెచ్చరించారు. శనివారం స్థానిక కొత్తూరు మారుతి నగర్ సమీపంలో కోడిపందేలకు సిద్ధం చేసిన బరిని రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆయన ధ్వంసం చేయించారు.

**బరులు ధ్వంసం**

**జంగారెడ్డిగూడెం:** స్థానిక సబ్ డివిజన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే తన ఫోన్ నెంబర్ 94407 96626కు లేదా డయల్ 112కు సమాచారం తెలియజేయాలని డీఎస్పీ రవిచంద్ర కోరారు.

**హెచ్చరిక బోర్డుల ఏర్పాటు**

**పోలవరం రూరల్:** కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఆయన పోలవరం మండలం గూటాలలో కోడిపందేల బరుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

**జూదాల అనర్థాలపై అవగాహన**

**ద్వారకాతిరుమల:** సంక్రాంతి పండుగ పేరుతో గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు చేపడతామని సీఐ యుజే విల్సన్ హెచ్చరించారు. పంగిడిగూడెంలో ఏర్పాటు చేసిన కోడి పందేల బరులను సీఐ విల్సన్, ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్‌లు శనివారం ధ్వంసం చేశారు.

**ర్యాలీలు**

**వేలేరుపాడు:** కోడి పందేల నిషేధమంటూ మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ర్యాలీలు నిర్వహించామని తహసీల్దార్ తెలిపారు.